
# అపోలో థర్టీన్
# మరియు
# మొగుడూపెళ్ళాం
# లోక
# కొంచెం ఎగుడూ దిగుడూ!

**మా** ఇంట్లో ఒక పట్టెమంచం వుంది. మొన్నీ మధ్యనే దానికి మావారు అపోలో థర్టీన్ అని నామకరణం చేశారు. ఆయన కాలి పొడుగుది అని ఎవరో అన్నట్లు ఆ మంచం కాళ్ళు చాలా పొడుగు. అవి ఒకొక్కటి శాటరన్ ఫైవ్ రాకెట్టుల్లాగున్నాయి. ఇంతెందుకు నాలుగు రాకెట్ల మీద పడుకున్నట్లు వుంటుంది దానిమీద నడుం వాలిస్తే- ఆ మంచం ఒకరికైతే సుఖంగా వుంటుంది. ఇద్దరికైతే చెడ్డ యిబ్బందిగా వుంటుంది. దాన్ని కదపటానికి అంతరిక్ష యాత్రికులు లాటివాళ్లు ముగ్గురుండాలి. ఆ మంచం చూస్తే నాకు చాలా కోపం! మామూలు సింగిలు దుప్పట్లు వేస్తే ఆకాశమంత ఎత్తుమనిషి అంగోస్త్రం చుట్టుకున్నట్లు వుంటుంది. ఆ మంచం మీద పరుపు వేస్తే కాళ్ళదగ్గర అడుగున్నర వెత్తీ అడ్డం దగ్గర మరొక మనిషి వత్తిగిలి పడుకుందుకు సరిపోయినంత పరుపు యివతల కొస్తుంది. అంచాత దానిమీద రెండు జంబుఖానాను పరిచి రెండు దుప్పట్లు వేస్తూ వుంటాను.

మా మంచం కింద పిల్లలు చేరి బొమ్మరిల్లు కట్టుకుని బువ్వాలాట లాడుకుంటారు. మా పిల్లలు మంచం కింద దీపారాధన చేయటం వలన ఒక పెడసవారంతా కాలిపోయి పరుపు కూడా అంటుకుని గదినిండా పొగ వస్తే వెళ్ళి రెండు తగల్నిచ్చి బాల్చీడు నీళ్ళుపోసి ఆర్పి నెత్తిమొత్తుకుంటూ ఏడుస్తూ కూర్చున్నాను. సవారుని బ్లేళ్ల పెట్టి కోసేస్తారు. పరుపుకు నిప్పం టించేస్తారు. కొబ్బరి నూనెలు ఒలకపోస్తారు. సబ్బిళ్లల్ని కాకులకి పెట్టే



స్తారు. ఫేస్ పవుడర్లూ స్నోలూ, కాటుకలూ, బొట్టుసీసాలూ ఒకటేమిటి అన్నీ పట్టికెళ్ళిపోయి ధ్వంసం చేసేస్తారు. వస్తువుకి వస్తువా దండగ డబ్బుకి శనిపట్టినట్లు మళ్ళీ మళ్ళీ కొనుక్కోవటం పైపెచ్చు ఇల్లంతా సత్రవులాగా అడివిలాగా తయారుచేస్తారు. ఈ ఇంట్లో ఆడపీనుగు వుందా చచ్చిందా అని అనుకునేట్లు ఎంత చేసినా ఇల్లు వెస్టు బెంగాల్లా వుంటుంది. డబ్బాలమీద మూతలు తీసేస్తారు. వీధి తలుపూ, దొడ్డి తలుపూ బార్లతీసి కుక్కలకు పెట్టేస్తారు. ఇంట్లో అందరికీ ఒకటో రెండో జతల చొప్పున జోళ్ళు వున్నాయా—అవి ఏ రెండూ ఒకచోట వుండవు. పుస్తకాలొకచోట

పిల్లల సంపీలొకపోట-ఆడపిల్లకు రిబ్బను నేనే వెతికి పెట్టాలి. పిల్లాడికి బెల్టూ నేనె వెతికి పెట్టాలి.

గురూగారు సంగతి సరేసరి. గడ్డం చేసుకోమని, తల దువ్వుకో మని, బట్టలు మార్చమనీ మనమే చెప్పాలి.

మా అపోలో థర్టీన్ మంచం గురించి చెబుతున్నాను కదా - అది ఒక జనతా ఎక్స్‌ప్రెస్సే అనుకోండి నేను మధ్యాహ్నం కాస్సేపు దానిమీద నడుం వాలుస్తాను. కళ్లు మూసుగుంటానంతే - నేనిల్లా మంచంమీద నడుం వాల్చగానే మా గ్యాంగి గ్యాంగంతా ఆ మంచంమీదకు తయారవుతారు. ఒకరు జుట్టు ముడివిప్పి తలతో ఆడుతారు, ఒకరుమీదెక్కి బండిఆట ఆడ తారు, ఈ పిల్లలు మన్ని మీదెక్కి తొక్కుతారు కదా - ఏమనుకుంటారో ఏవిటో.... వున్నపూలు తల్లోంచి పీకటమో, తల్లో ఆకులూ పిచ్చి పూలూ తెచ్చి కుక్కడమో, ఏదో ఒకటి మీదపడేసి అల్లరిచేస్తూ వుంటారు. కడు పుబ్బి పోతే అక్కడే మీద పోసేస్తారు కూడా. తిట్టినా కొట్టినా మళ్ళీ అక్కడికే వచ్చి చేరుతారు. పోతే అది పెట్టమనీ, ఇది పెట్టమనీ ఒకటి తరువాతొకటి వేదించుకుతింటారు. డబ్బుల కోసం పేచీలు - ఒకరు పెళ్లి పంచదార బొక్కేస్తారు. ఒకరు డికాక్షన్ పారబోస్తారు. యింకొకరు పాలల్లో చేతులుపెట్టి మీగడ నాకేస్తారు. మంచినీళ్ల బిందెలో ఎంగిలి గ్లాసులు ముంచేస్తారు. చెప్పుకుంటే సిగ్గు ఎవరైనా పెద్ద మనుషులు వస్తే ధైర్యంచేసి కూర్చోమనటానికి వీలుగా ఉండవు కుర్చీలు. రోహిణీకార్తిలో కూడా కుర్చీలు తడితడిగానే వుంటాయి. ఆరేసుకున్న మడతలు పెట్టిన బట్టలన్నీ బీరువా చుట్టూ నేలమీద దొర్లుతూ వుంటాయి. ఆ పువ్వుల్లా ఉతి కిన బట్టలను తొక్కేస్తూ నలిపేస్తూ క్రిందవి మీద మీదవి కిందా పెడ్తెస్తూ ఆడుతూ వుంటారు. ఇస్త్రీమడతలైతే ఒకటి తరువాత ఒకటి తీసి తొడి గేయడం విప్పేయటం, తొడిగేయటం విప్పేయటం వాళ్లకిదో ఆట-పిల్లలకి చెలగాటం తల్లికి ప్రాణసంకటంలా వుంటుంది. ఏం చేస్తాం ? కాస్సేపు నేను మొత్తుకుని, వాళ్ళనో రెండు మొత్తి, ఒవతల కేడుస్తాను.

వారుంటే యింకా గొడవ. న్యూసెన్స్, న్యూసెన్స్, అరవకు, కేకలెయ్యకు, డర్టీహవుస్, డర్టీవైఫ్, డర్టీపిల్లలు అని నన్ను నోరుమూయమని ఆయన నోరు చేసుకుంటారు. మీకెందుకు వూరుకోండి, మీరేమీ ముద్దు కడిగారా, మూతులు కడిగారా, నా ప్రాణం విసిగితే నేను తిట్టుకుంటాను, కొట్టుకుంటాను. మీరాట్టే కలగజేసుగోకండి అని నేనంటాను. ఇది ఇల్లా నరకమా? ఇది హవుసా స్ట్రీటా అని వారు అరుస్తారు. అరవండరకండి అరిచేకుక్క కరవదుగదా అని నిమ్మళంగా లోపలే అనుకుంటానను కోండి.

ఏవిటే కుక్కలంటున్నావ్ ? రోజుకి ఇరవై రూపాయలు, నెలకు సిక్స్ హాండ్రడ్స్, ఏడాదికి ఏడువేల రొండొందలు కరుకులు పది సంవత్సరాలలో డబ్భై రెండువేలు తెచ్చి నీ వళ్లో పోస్తుంటే. డామిట్! ఇలాటిలాటి మాటలంటావా యూ బ్లడీ బగ్గర్- నీకు ఒళ్లు పొగ రెక్కిందే నా సొమ్ముతిని మీకందరికీ కొవ్వెక్కిందే, నన్ను గాకుండా ఏ ఎలిమెంటరీ స్కూలు టీచర్నో, తాలూకాఫీసు గుమాస్తానో కట్టుకునుంటె నీ తొక్కవల్చేసేవాడు - షేక్కర్ అని అపోలో థర్టీన్‌లా భూమికక్ష్యను ఛేదించుకుని వెళ్ళిపోయేవారు. అప్పుడు నేను లూనార్ మాడ్యూల్‌లా వెంబడించేదాన్ని. ఏంటన్నారూ? మళ్ళీ టాకండి. సిగ్గు లేకపోతేసరి నేనేగాక మరొకత్తెవత్తయినా మిమ్మల్ని పెళ్లాడేసుంటే మిమ్మల్ని సుబ్బరంగా తిరుపతి క్షవరంచేసి గాడిదెక్కించేసి వూరేగించి ఉండును, మీ సంపాదనంతా తన పుట్టింటికి నడిపించేసి వుండును. “నిజవా డార్లింగ్ అది అలా చేస్తుందంటావా? “అయ్యో, మీకింకా అనుమానవా? అది అలాగే చేస్తుంది. “మరి నేను దానిజుట్టు పట్టుకుని వంగదీసి వీపుమీద నాలుగు గుద్దులు వేయలేనా?” “మీరు దాన్ని వంచి వీపుమీద కొట్టబోతుండగా అది మీ మోకాలిమీద కరిచి పారిపోతుందండీ “అయ్యో మనిషి కాటుకి మందులేదే ఎల్లాగ?” ఎల్లాగేముందండీ. మిమ్మల్ని పిచ్చాసుపత్రిలో చేరుస్తారు- అది దాని పుట్టింటికి చక్కాపోతుంది. “పుట్టింటికివెళ్తే దాన్ని తన్ని లాక్కురానూ, చేతులకి గాజులు తొడిగించుకు కూర్చుంటాననుకున్నావా?” అది జగఝంత్రీ

దండీ. దాని అన్న పెద్దపెద్ద మీసాలూ వాడూ మిమ్మల్ని స్టంటులోపెట్టి ఏ కుర్చీనే ఎత్తి నెత్తిమీద మొట్టడుటండీ! అవునేవ్ మాబాగా చెప్పావు. తల పాగా చుట్టుకుని మొల్లో బత్తాయి చాకు దోపుకుని వెళ్తాను. వెధవని చూసి పెట్టి డొక్కలో తంతాను. గిరగిరా తిరిగి పడాల్సిందే మీసాలు పీకేస్తాను. ఏవనుకుంటున్నావో....” అప్పుడు మీ పెళ్ళాం ముండ మిమ్మల్ని చూసి నవ్వుతుందండీ “ఛఛ ముండ అనకు నీకు పాపం చుట్టుగుంటుంది” లేక పోతే అదేవిటి పెద్ద పతివ్రత అనుకుంటున్నారా? “అవును. కాను,పరాయి స్త్రీలను గురించి అలా అనటం మంచిదికాదు” “మీ పెళ్లాం నాకు పరాయి స్త్రీ ఎలాగవుతుందండీ?” “అవునే నా పెళ్ళాం నీకేమవుతుంది ? అప్పుడు నువ్వు నాకేమవుతావ్?” ఏమిటోనండీ అంతా అపోలో థర్టీన్‌లా గందర గోళంగావుంది. ఊళ్లో పెద్దమనుష్యులెవర్నన్నా కనుక్కుందాం. ఇంతలో తలుపుమీద దబ దబా బాదిన చప్పుడయింది. వచ్చె వచ్చె అంటూ తల ముడేసుగుంటూ వెళ్ళి తలుపు తీశాను. ఏమిటలా వున్నారు అంటూ ఆ వచ్చిన బెండయ్యగారు ఇహ్హిహీ అంటూ నవ్వారు. చెప్పొద్దూ నా కొళ్ళు మండిపోయింది. మేవు అపోలో థర్టీన్ గురించి మాట్లాడుకుంటున్నావండీ అన్నాను నేను. మాట్లాడుకోండి, మాట్లాడుకోండి ఆ పక్కవారిల్లు ఇదే ననుకుని తలుపు తట్టాను. అమ్మడూ తలుపేసుకో అని బెండయ్యగారు వచ్చిన దారినే వెళ్ళిపోయాడు. మేంకూడా ఇహ్హిహీ అంటూ నవ్వుకున్నాం మీరు కూడా ఇహ్హిహీ అంటూ నవ్వండి. నవ్వడం చేతగాకపోతే నోరు మూసుకోండి, దట్సాల్ !